క్లుప్తంగా

విద్యా దాత పుండరీకాక్షుడు

బాపట్ల అర్బన్: బాపట్ల ప్రాంతంలో విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేసిన అన్నవరపు పుండరీకాక్షుడు చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు అన్నారు. పుండరీకాక్షుడి 175వ జయంతిని శనివారం ఏవీవీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సభలో ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 1913లోనే బాలికా పాఠశాల స్థాపనకు 13 ఎకరాల స్థలాన్ని పుండరీకాంక్షుడు దానం చేసినట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల స్థాపనకు ఆయన ఏర్పరిచిన నిధి నుంచి రూ. 50 వేల విరాళంగా ఇచ్చారని చెప్పారు. అభ్యుదయ భావాలు కల మానవతా మూర్తి అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యూ జీకే మూర్తి, ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్‌లో కొల్లూరు విద్యార్థి సత్తా



కొల్లూరు: తెనాలిలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల హ్యాండ్ బాల్ జట్టుకు కొక్కు చరణ్‌సాయి ప్రాతినిధ్యం వహించాడు. పోటీలో తన ప్రతిభను చాటాడు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని, పీఈటీ పెదపూడి నాగేశ్వరరావును అభినందించారు.

పెనుమర్రులో న్యాయ విజ్ఞాన సదస్సు



పెనుమర్రు(వేమూరు): వివాద రహిత గ్రామాలను తీర్చిదిద్దేందుకు అవసరమైన న్యాయ సలహాలు ఇస్తున్నట్లు న్యాయవాది బొర్రు రవీంద్ర తెలిపారు. మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తెనాలి కోర్టు చైర్మన్ ఆదేశాలు మేరకు గ్రామస్తులకు న్యాయ సలహాలు , సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పి.ఆదియ్య, పంచాయతీ కార్యదర్శి చావలి సువర్ణబాబు, వీఆర్వో గాజుల దితేంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన పెసర్లంక విద్యార్థి



భట్టిప్రోలు: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న వడ్డి మనోజ్ సాయి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. త్వరలో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో అతను పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్, ప్రతిభ చూపిన మనోజ్ సాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా



కొల్లూరు: ఇటుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లో పల్టీ కొట్టిన ఘటన దోనేపూడి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. కొల్లూరు నుంచి ఇటుక లోడుతో దోనేపూడి వైపు ట్రాక్టర్ వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. నియంత్రణ కోల్పోయిన ట్రాక్టర్ కరకట్ట మార్గం నుంచి అదుపు కోల్పోయి పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లోకి దూసుకువెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ ట్రాక్టర్ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకోగలిగాడు. ఈ ఘటనపై కొల్లూరు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్యను రోడ్డుపై కొట్టి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ 5వ లైనులో నివసించే షేక్ బాజి రింగ్ రోడ్డు లోని ఓ స్వీట్ షాపులో పని చేస్తుంది. ఆమె భర్త సురేష్ మద్యం తాగి తరచూ అక్కడకు వెళ్లి గొడవపడుతుండేవాడు. దీంతో షాపు యజమాని బాజీని ఉద్యోగం నుంచి తీసి వేశాడు. ఆమె శనివారం ఎస్వీఎన్ కాలనీలోని ఓ స్వీట్ షాపులో ఉద్యోగం కోసం వెళుతుండగా భర్త సురేష్ అడ్డగించి రోడ్డుపైనే కొట్టాడు. అనంతరం ఆమె మారుతీనగర్‌కు చేరుకోగా అడ్డగించి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించాడు. బాజీ పరుగెత్తుకుంటూ తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పాత నందాయపాలెంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్తే రూ.వేలకు వేలు ఖర్చవుతున్నట్లు చెప్పారు. ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రమ్య, సుహానాబేగం సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సర్పంచులు కావూరి చిట్టెమ్మ, ఆట్ల వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ టీవీ సాంబశివరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చంపాడు(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్ అన్నారు. చంపాడు గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 231 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యులు రవళీ, కోటేశ్వరి, సంతోష్ రాయల్ వైద్య సేవలు అందించగా.. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: పెనుమూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విశ్వేశ్వరం, మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో వైద్యులు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తహసీల్దారు శ్రీచరణ్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

534 మందికి వైద్య సేవలు

పెసర్లంక(భట్టిప్రోలు): మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 534 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, గుణ సాయిరామ్, కృపా సుమతి, కిన్నెర, కంటి వైద్య నిపుణురాలు అరుణరాణి (పీఎంవోఏ) పాల్గొని, వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం. హనుమంతరావు, ఎంఈవో నీలం దేవరాజు, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పెసర్లంక, చింతమోటు, పెదలంక సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, వేములపల్లి శ్రీరంజని, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ నన్నెపాముల చంటి తదితరులు పాల్గొన్నారు.



చంపాడులో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



ఆలపాడులో అందిస్తున్న వైద్య సేవలు



పెసర్లంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేత



ప్రజ్జంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

430 మందికి వైద్య సేవలు

ఆలపాడు(వేమూరు): చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో శని వారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 430 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియదర్శి, డాక్టర్లు రమేష్, శ్రీవాణి, సీహెచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

కొల్లూరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ.. ఖరీదైన వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తోందని మండల ప్రత్యేకాధికారి రమణ అన్నారు. శనివారం మండలంలోని గాజుల్లంకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్థానిక సర్పంచి సనక వెంకట్రావుతో కలసి ఆయన పాల్గొన్నారు. 436 మందికి కంటి, ఇతర అనారోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్డీ రవిబాబు, ఆర్ఐ త్రివేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

నిజాంపట్నం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి హరనాథబాబు అన్నారు. ప్రజ్జం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హరనాథబాబు కోరారు. వైద్యులు 350మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సేరేష్, తహసీల్దారు నెహ్రూబాబు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నల్లపాటి రామయ్య, సర్పంచ్ పుష్పాల బసవపూర్ణమ్మ, శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, బండారు రామారావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



పెనుమూడిలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



గాజుల్లంకలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ఇంటికే వైద్య సేవలు

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంటికి వైద్య భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని సంగుపాలెం, బాపట్ల మండలంలోని చెరువుజమ్ములపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి శిబిరాల్లో పాల్గొని, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, కటికల యోహోషువా, చింతల రాజశేఖర్ పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు బీమా నగదు అందజేత

రేపల్లె: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షెల్ గోరి శనివారం మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చులకు రూ.10వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్ షేక్ అబ్దుల్లా, సచివాలయ కన్వీనర్ కనపర్తి రవిశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

రేపల్లె: నగరం మండలం అద్దంకివారిపాలేనికి చెందిన విచారపు పవన్ కుమార్ శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ వెంకట రమణారావు కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పని చేయాలని పవన్ కుమార్‌కు చెప్పారు. మాజీ జెడ్పీటీసీ ప్రేమ్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు పల్లెకోనలో వైద్య శిబిరం

భట్టిప్రోలు: మండలం పల్లెకోన సచివాలయం పరిధిలోని ప్రజలకు స్థానిక ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నిజాంపట్నం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కుర్రా కిరణ్ కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో హరిబాబుకు వినతి పత్రాన్ని అందించారు. కుర్రా కిరణ్ మాట్లాడుతూ నెల జీతాలు సకాలంలో రాకపోవడం వల్ల బ్యాంకు లోను తీసుకున్న వారు ఈఎంఐలు సకాలంలో కట్టలేకపోవడంతో బ్యాంకు నోటీసులు అందుకోవాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, తాజ్‌ముల్లా, రవింద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేని సంక్షేమ పాలన

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- కావూరులో గడప గడపకు మన ప్రభుత్వం

చెరుకుపల్లి: అవినీతికి తావులేని సంక్షేమ పాలన అందిస్తూ.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. కావూరు గ్రామ సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీ మోపిదేవికి ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకుడు తుమ్మల నరేంద్రనాథ్ విగ్రహాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో పార్టీ నాయకులతో కలసి మోపిదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందించారు. ఈ క్రమంలో స్థానిక ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాలనకు ప్రజా దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఎరువు, పురుగు మందులు దొరక్క రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని మోపిదేవి గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎక్కడా అటువంటి పరిస్థితిని రానివ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ వెంకట పావని, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి సుమలత, నాయకులు రావూరి ఆంజనేయులు, తుమ్మల వాసు, ముసలమడుగు నాగరాజు, ఇసుకపల్లి స్రవంతి, నన్నపనేని వెంకటరావు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

అర్హత కలిగిన వారికి రుణాలు అందించాలి

రేపల్లెరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని బాపట్ల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకర్లు అందించే రుణాలతో స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులు, రైతులు, పశు పోషకులు ఆర్థిక పరిపుష్టి సాధించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు సరిగా చూసిన అనంతరమే రుణాలు అందించాలన్నారు. లబ్ధిదారులు సైతం తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చైతన్య పరచాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, నియోజకవర్గంలోని పశువైద్యాధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అపహరణ

తెనాలి రూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ సాలిపేటకు చెందిన గుంటూరు సురేష్‌బాబు శుక్రవారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూడగా కనబడలేదు. ఆయన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్‌సీసీతో ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి

తెనాలి రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్ల రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. విద్యార్థుల్ని ఉద్దేశించి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి నేర్పిస్తుందని చెప్పారు. తమ విద్యార్థి జయేంద్ర కుమార్ ఈ ఏడాది ఎన్‌సీసీ ద్వారానే మెడిసిన్‌లో సీట్ సంపాదించడం కళాశాలకి గర్వకారణం అని కరస్పాండెంట్ మేరీ గ్రేస్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ప్రియదర్శిని, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగం సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సామ్యూ నాయక్, కళాశాల సిబ్బంది, ఎన్‌సీసీ స్టాఫ్ పాల్గొన్నారు.

సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మకం

ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

తెనాలి టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మక నిర్ణయంగా ప్రజలు పేర్కొంటున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు టి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అంగలకుదురులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి రాష్ట్రంలో 1.40లక్షల ఉద్యోగాలు కల్పించారని, ఎందరో యువతీ, యువకులకు ఉపాధి లభించినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే అంతా కలసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా ఉద్యోగులు, వలంటీర్లు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు, ఎంఈవో జయంత్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండి హేమారావు, జాస్తి శ్రీనివాసరావు, మొవ్వా ఆనంద్, తోట శ్రీకాంత్, మేరా సాహెబ్, బాదుల్లా, చుండూరు గోపి, కిరణ్ చంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

■ గుడివాడలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం వెల్‌నెస్ సెంటర్‌లను నాగార్జునరెడ్డి పరిశీలించారు. కేంద్రాల్లో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, సచివాలయ, వ్యవసాయ సిబ్బందిని ప్రభుత్వ పథకాలు అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కంచర్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. అనంతరం బుర్రిపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల్ని నాగార్జునరెడ్డి పరిశీలించారు.

మాదిగలకు న్యాయం చేసే రాజకీయ పార్టీకే మద్దతు..

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

బాపట్ల అర్బన్: వచ్చే ఎన్నికల్లో మాదిగలకు 15 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు కేటాయించే రాజకీయ పార్టీకే తాము మద్దతు ఇస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు స్పష్టం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆయన మాట్లాడారు. బాపట్ల జిల్లాలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేస్తామన్నారు. దీనిలో భాగంగానే జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా పిన్నిబోయినవారిపాలేనికి చెందిన బనసాల రామకృష్ణను నియమించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలన్నీ మాదిగ సామాజిక వర్గాన్ని మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. ఇకపై తమకు న్యాయం చేసే రాజకీయ పార్టీతోనే తాము ప్రయాణం చేస్తామని తెలిపారు. బాపట్ల జిల్లాలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం దాసరి సువర్ణరాజు, బి.రామకృష్ణను గజమాలతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నుంచి ర్యాలీగా బయలు దేరి సభా స్థలికి చేరుకున్నారు. భారత జాతీయ దళిత క్రైస్తవ ఫోరం అధ్యక్షుడు అట్లూరి విజయ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సువర్ణరాజు, రామకృష్ణకు సత్కారం

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ఓలేరు(భట్టిప్రోలు): వెల్లటూరు సబ్ యూనిట్ పరిధిలోని ఓలేరులో శనివారం ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ శివ నాగేశ్వరమ్మ, ఎం.టి బాలపాప ఆధ్వర్యంలో గద్దె సుశీలకు చెందిన వరి పంట పొలంలో పర్యటించి, నాము, పాముపొడ తెగుళ్లను గుర్తించారు. వీటి నివారణకు పశువుల పేడ, మూత్రం, ఇంగువతో ద్రావణం తయారీ విధానాన్ని వివరించారు. అలాగే వెల్లటూరులోని మదర్ థెరీసా గ్రామ సంఘంలోని జమున పంట పొలంలో పసుపు ప్లేట్లు, లింగాకర్షక బుట్టలు పెట్టడం వల్ల కలిగే ఉపయోగాన్ని వివరించారు. అలాగే ఎస్–2 ఎస్ కాంపార్ట్ బ్లాక్ పంట పొలంలో పెట్టించారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్పీలు పాల్గొన్నారు.



ద్రావణం తయారీ విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

‘కృష్ణా నదీ జలాల పంపిణీపై కేంద్రం నిర్ణయం సరికాదు’

లక్ష్మీపురం: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణానదీ జలాల పంపిణీపై కేంద్ర మంత్రి మండలి తీర్మానం సరికాదని, రాష్ట్ర ప్రజల ఆందోళనను పరిగణలోకి తీసుకోవాలని సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సదాశివం మాట్లాడారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీ కోసం ప్రస్తుతమున్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కే బాధ్యత అప్పగించడం, కొత్త విధి విధానాలను ఖరారు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీం కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగా, జలాల పంపిణీ బాధ్యతను కొత్తగా దానికెలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాగు రంగ నిపుణులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ కేంద్ర నిర్ణయం రాష్ట్రానికి శరాఘాతమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్రం ఈ నిర్ణయం చేసిందని ఆరోపించారు. కేంద్ర కేబినెట్ నిర్ణయం సుప్రీం కోర్టులో నిలవదని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం

సౌకర్యాల కల్పనపై ఢిల్లీ వైద్య బృందం సూచనలు

తెనాలిఅర్బన్: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ముస్కాన్ ఎసెస్‌మెంట్ టీమ్ తెనాలి జిల్లా వైద్యశాల పర్యటన శనివారంతో ముగిసింది. తల్లిపిల్లల వైద్యశాలలోని ఓపీ, ఎస్ఎన్‌సీయూ, క్యాజువాలిటీ వంటి విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు డాక్టర్ పొన్ను రాజు, డాక్టర్ సునీత పలివాల్‌లు మాట్లాడుతూ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ముస్కాన్ టీమ్ రెండు రోజులు తమ వైద్యశాలలో పర్యటించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ కంట్రోల్ నార్మ్స్ ప్రకారం వైద్యశాల నిర్వహిస్తుందా లేదా అనేది పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, డైట్ వంటి వాటిపై ఆరాతీశారు. వారు ఇచ్చిన సూచనలను అమలు చేస్తూ మరింత మెరుగైన వైద్యాన్ని చిన్నారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.